సాక్షి ఆదిలాబాద్

గురువారం । 23 । మార్చి । 2023



హ్యాండ్‌బాల్ ఆణిముత్యం.. మౌనిక

హ్యాండ్‌బాల్‌పై ఉన్న మక్కువతో ఇప్పటికే జిల్లా, రాష్ట్రస్థాయిలో సత్తా చాటింది నార్నూర్‌లోని ఏకలవ్య ఆదర్శ పాఠశాల విద్యార్థిని ఎం.మౌనిక. తాజాగా జాతీయస్థాయి పోటీల్లోనూ పాల్గొంటుంది. 8లో▸

రాష్ట్రస్థాయి కవి సమ్మేళనంలో 'ఉదారి'

ఎదులాపురం: ఉగాది పర్వదినం పురస్కరించుకుని తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో బుధవారం నిర్వహించిన కవి సమ్మేళనంలో జిల్లాకు చెందిన కవి ఉదారి నారాయణ పాల్గొన్నారు. 'మరో విపత్తు' అనే కవితను వినిపించారు. పలువురు కవులు, ఆయనకు అభినందనలు తెలిపారు.

గరిష్టం/కనిష్టం
34.0/22.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండవేడిమి పెరగనుంది. గాలిలో తేమశాతం తగ్గనుంది.

న్యూస్‌రీల్

'చెట్టు తల్లి' కవితా సంపుటి ఆవిష్కరణ



కవితా సంపుటి ఆవిష్కరిస్తున్న గోపి

ఆదిలాబాద్: జిల్లాకు చెందిన బొల్లారపు బాబన్న రచించిన చెట్టు తల్లి కవితా సంపుటిని ప్రసిద్ధ కవి, తెలుగు విశ్వవిద్యాలయం మాజీ వీసీ ఎన్. గోపి హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో బుధవారం ఆవిష్కరించారు. ఆదిలాబాద్ జిల్లా కవుల కవిత్వం ఎంతో సహజంగా, వారి జిల్లాలో ఉన్న అడవిని పోలి ఉంటుందని కొనియాడారు. బాబన్న సాహిత్యంలో గొప్ప కవిగా ఎదగాలని ఆకాంక్షించారు. జిల్లా కవి డాక్టర్ ఉదారి నారాయణ పాల్గొన్నారు.

ఉత్తమ పంచాయతీల ఎంపిక

- జిల్లా స్థాయిలో 27.. మండల స్థాయిలో 459
- నేడు, రేపు పురస్కారాలు అందజేత

కైలాస్‌నగర్: కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన తొమ్మిది అంశాల్లో ప్రగతి కనబర్చిన పంచాయతీలకు జిల్లా యంత్రాంగం పురస్కారాలు ప్రకటించింది. మండలస్థాయిలో ఒక్కో మండలం నుంచి 27చొప్పున 17 మండలాలకు 459 జీపీలను పురస్కారానికి ఎంపిక చేశారు. అలాగే జిల్లా స్థాయిలో 27 పంచాయతీలకు గుర్తింపునిచ్చారు. 2022–23 సంవత్సరానికి గాను జాతీయ పురస్కారాల్లో భాగంగా గతేడాది అక్టోబర్‌లో పంచాయతీల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఉపాధి హామీ పనులు, ఆరోగ్యం, పిల్లలతో స్నేహపూర్వకం, నీటి వనరుల లభ్యత, పచ్చదనం పరిశుభ్రత, మౌలిక వసతులు, సామాజిక భద్రత, సుపరిపాలన, మహిళల భద్రత వంటి తొమ్మిది అంశాల్లో దరఖాస్తులు స్వీకరించారు. పంచాయతీ కార్యదర్శులు 15 రోజుల పాటు శ్రమించి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. వీటి ప్రకారం స్కోర్‌ను ప్రకటించి మండలస్థాయిలో 459 జీపీలను ఎంపిక చేశారు. ఆయా పంచాయతీల పాలకవర్గాలను గురువారం మండలస్థాయిలో ఎంపీపీ, ఎంపీడీవోల చేతుల మీదుగా సన్మానించి ప్రశంసపత్రాలు అందజేయనున్నారు.

27 పంచాయతీలకు జిల్లా స్థాయి పురస్కారం

జిల్లాస్థాయి పురస్కారానికి 27 జీపీలను ఎంపిక చేశారు. ఇందులో ఉట్నూర్, నర్దంగూడ, నర్సాపూర్–బి(ఉట్నూర్), జైనథ్, గిమ్మ–కే (జైనథ్), కొట(బోథ్), గుంజాల, గంగాపూర్, మలంగి,మహాగాంవ్ (నార్నూర్), రుయ్యాడి, ఉండం, కజ్జర్ల (తలమడుగు), కుమారీ (నేరడిగొండ), గులాబ్‌తండా, దహెగాంవ్, (బజార్‌హత్నూర్),ముత్రా(కే)(ఇచ్చోడ),ఏమాయికుంట (ఇంద్రవెల్లి), చాంద–టి(ఆదిలాబాద్ రూరల్), బట్టిసావర్‌గాంవ్ (మావల) పంచాయతీలను పురస్కారాలకు ఎంపిక చేశారు. ఇందులో ముత్రా (కే), గుంజాల మూడు విభాగాల్లో పురస్కారం పొందనుండగా, రుయ్యాడి, ఉమడం రెండేసి విభాగాల్లో అందుకోనున్నాయి. ఆయా పంచాయతీల పాలకవర్గాలను ఈ నెల 24న ఉదయం 11 గంటలకు జెడ్పీ సమావేశ మందిరంలో కలెక్టర్ చేతుల మీదుగా సన్మానించనున్నారు. పంచాయతీల పేరిట పురస్కారాలు అందజేస్తామని అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. ఈ పంచాయతీలను రాష్ట్రస్థాయికి పంపనున్నట్లు వెల్లడించారు.



తన వ్యవసాయ క్షేత్రంలో అరక పట్టిన బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు

- జిల్లావ్యాప్తంగా ఉగాది వేడుకలు
- ఆలయాల్లో పంచాంగ శ్రవణం
- పచ్చడి, గుడాలు పంపిణీ
- చేలలో అన్నదాతల పూజలు

శోభాయమానంగా శోభకృత్

శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠంలో ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న



ఆదిలాబాద్: తెలుగు సంవత్సరాది ఉగాది పండుగను జిల్లావ్యాప్తంగా బుధవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం నుంచే ఆలయాల్లో భక్తుల తాకిడి కనిపించింది. గ్రామాల్లో రైతులు వేకువజామునే చేలకు వెళ్లి అరక పూజలు చేపట్టారు. ఎమ్మెల్యే జోగు రామన్న జిల్లా కేంద్రంలోని శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠం, శాంతినగర్ సాయిబాబా ఆలయాల్లో పూజలు నిర్వహించారు. రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో చేపట్టిన ఉగాది పచ్చడి పంపిణీలో పాల్గొన్నారు. శ్రీరామచంద్రగోపాలకృష్ణ మఠం, కైలాసనగర్ కాలనీలోని హనుమాన్ ఆలయంలో వెంకటేశ్వరశాస్త్రి సిద్ధాంతి, ఉమామహేశ్వర ఆలయంలో ప్రవీణ్‌శర్మ పంచాంగ శ్రవణం చేపట్టారు.కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. వడ్డెర కాలనీలోని హనుమాన్ ఆలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ పూజలు నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో నివసిస్తున్న మరాఠీలు తమ సంప్రదాయం ప్రతిబింబించేలా ఇంటిపైన కట్టెకు చెంబు, చీరను కట్టి తమ సంస్కృతిని చాటుకున్నారు. కార్యక్రమాల్లో శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠాధిపతి యోగానంద సరస్వతి స్వామి, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, డీఎస్పీ ఉమేందర్, సనాతన హిందూ ఉత్సవ సమితి గౌరవ అధ్యక్షుడు ప్రఫుల్ వజే, అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలోని శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠంలో పంచాంగ శ్రవణం చేస్తున్న వెంకటేశ్వరశాస్త్రి సిద్ధాంతి



ఉమామహేశ్వర ఆలయంలో పంచాంగ శ్రవణం..



రేణుకామాత ఆలయంలో హారతి స్వీకరిస్తున్న మహిళలు

'ఔట్‌సోర్సింగ్'లో అక్రమాలు!

- నాలుగేళ్లుగా ఏజెన్సీల ఎంప్యానల్‌మెంట్ గడువు పొడిగింపు
- టెండర్ల నిర్వహణకు చర్యలు కరువు
- గుర్తింపు లేని ఏజెన్సీలకూ వర్క్‌ఆర్డర్
- ఇటీవలే ఏసీబీకి చిక్కిన ఉపాధికల్పన శాఖ అధికారులు



సాక్షి,ఆదిలాబాద్: ప్రభుత్వ శాఖల్లో ఔట్‌సోర్సింగ్ సర్వీసులను ఏజెన్సీలు చేపడతాయి. వీటికి నియామక ప్రక్రియ అప్పగించాలంటే ముందుగా ప్రభుత్వం నుంచి గుర్తింపు పొందాలి. దీనినే ఎంప్యానల్మెంట్ అంటారు. 2019–20 సంవత్సరంలో దీనికి సంబంధించి టెండర్లు నిర్వహించి ఏజెన్సీలను గుర్తించారు. ఆ తర్వాత ఏటా వాటి గడువు పొడిగిస్తూ వస్తున్నారు. 2022–23 వరకు ప్రస్తుత గడువు ఉంది. ఔట్‌సోర్సింగ్ కమిటీ చైర్మన్ అయిన కలెక్టర్‌కు ఈ టెండర్ల నిర్వహణకు సంబంధించి విచక్షణ అధికారాలు ఉంటాయి. ప్రస్తుతం ఎంప్యానల్మెంట్ నుంచి మొదలుకొని వర్క్‌ఆర్డర్.. ఇలా ప్రతీ అంశంలో అక్రమాలు వెలుగు చూసిన నేపథ్యంలో ఇప్పుడున్న దాన్ని రద్దు చేసి కొత్తగా టెండర్లు చేపట్టి దీన్ని గాడిలో పెట్టేందుకు ఏవైనా చర్యలు తీసుకుంటారా..లేదా అనేది కమిటీపైనే ఆధారపడి ఉంది.

ఎంప్యానల్‌మెంట్‌లో లేని ఏజెన్సీలకు వర్క్‌ఆర్డర్..

అప్పట్లో ఎంప్యానల్‌మెంట్‌లో 17 ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలను గుర్తించారు. వాటికి మాత్రమే వర్క్‌ఆర్డర్ ఇవ్వాలి. ప్రస్తుతం జిల్లాలో 20 ఏజెన్సీలు వివిధ ప్రభుత్వ శాఖల్లో వర్క్ ఆర్డర్ నిర్వహిస్తున్నాయి. అదనంగా 3 ఏజెన్సీలు ఎలా పుట్టుకొచ్చాయన్నది ప్రశ్న. జిల్లా ఔట్‌సోర్సింగ్ కమిటీకి తెలిసి జరిగిందా.. తెలియక జరిగిందా.. అనేది స్పష్టం కావాల్సి ఉంది. ప్రస్తుత కలెక్టర్ రాహుల్‌రాజ్ జిల్లాలో బాధ్యతలు చేపట్టే ఒకరోజు ముందు ఏసీబీ దాడుల్లో ఉపాధికల్పన శాఖ అధికారులు కిరణ్‌కుమార్, విజయలక్ష్మి పట్టుబడ్డారు. ఓ ఏజెన్సీకి వర్క్‌ఆర్డర్ ఇచ్చే విషయంలో రూ.2.25 లక్షలు లంచం తీసుకుంటూ దొరికిపోయారు. దీంతో ప్రస్తుతం జిల్లాలో ఉన్న ఎంప్యానల్‌మెంట్, వివిధ ప్రభుత్వ శాఖల్లో అస్తవ్యస్తంగా ఉన్న ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల నిర్వహణ తీరును కమిటీ గాడిలో పెట్టేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటుందని నిరుద్యోగులు ఆశగా ఎదురుచూస్తున్నారు. తద్వారా ఈ ఔట్‌సోర్సింగ్ నియామకాలు సజావుగా జరిగి అర్హులైన వారికి దక్కాలన్నదే వారి ఆశయం. ఆ విషయంలో కమిటీ తన పారదర్శకతను నిరూపించుకోవాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం నిరుద్యోగుల్లో వ్యక్తమవుతుంది.

ఏజెన్సీల అక్రమాలకు అడ్డేది..?

జిల్లాలో ఏడాది క్రితం బీసీ సంక్షేమ శాఖలో అక్షర ఏజెన్సీకి సంబంధించి అక్రమం వెలుగు చూసింది. ఇందులో కింది స్థాయి ఔట్‌సోర్సింగ్‌కు చెందిన కుక్, వాచ్‌మెన్, తదితర ఉద్యోగులకు సంబంధించి ఈ ఏజెన్సీ నెలల తరబడి వేతనాలు చెల్లించకుండా, అలాగే పీఎఫ్ కట్టకుండా ప్రభుత్వం నుంచి లక్షల రూపాయల బిల్లులను డ్రా చేసుకున్నారు. ఈ వ్యవహారాన్ని అప్పట్లో 'సాక్షి' వెలుగులోకి తెచ్చింది. ఈ విషయంలో ఇప్పటివరకు ఆ ఉద్యోగులకు వేతనాల పరంగా న్యాయం జరగలేదనే విమర్శలు ఉన్నాయి. జిల్లా ఔట్‌సోర్సింగ్ కమిటీ ఈ విషయంలో చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. అప్పట్లోనే ఉపాధికల్పన శాఖ అధికారిపై విమర్శలు వ్యక్తమయ్యాయి. తాజాగా వెలుగులోకి వస్తున్న అంశం ఏమిటంటే.. అక్షర ఏజెన్సీ అసలు ఎంప్యానల్మెంట్ జాబితాలోనే లేదు. ఇలా జిల్లాలో మూడు ఏజెన్సీలు ఎంప్యానల్‌మెంట్‌లో లేకున్నా వాటికి వర్క్‌ఆర్డర్ ఇవ్వడంలో ఎవరు బాధ్యులు అనేది తేలాల్సి ఉంది. ఒకవేళ కమిటీలో కీలకంగా వ్యవహరించే ఉపాధికల్పన శాఖాధికారులు ఇలా బహిరంగంగా అక్రమాలకు పాల్పడుతుంటే దానికి అడ్డుకట్ట వేసే అధికారాలు కమిటీలో లోపించాయా అన్న విమర్శలూ లేకపోలేదు. ఇలాంటి పరిస్థితుల్లో కొత్త ఎంప్యానల్మెంట్‌ను రూపొందించి నిరుద్యోగులకు ఔట్‌సోర్సింగ్ నియామకాల్లో పారదర్శకతపై నమ్మకం కలిగించడంలో ఈ కమిటీ సక్సెస్ అవుతుందా.. లేదో వేచి చూడాల్సిందే.

గాడిలో పడేనా..

ఉపాధికల్పన శాఖ అధికారి కిరణ్‌కుమార్, జూనియర్ ఉపాధికల్పన శాఖ అధికారి విజయలక్ష్మిలు ఏసీబీకి పట్టుబడి 50 రోజులు దాటింది. ఆ తర్వాత ఫిబ్రవరి మూడో వారంలో మంచిర్యాల ఉపాధికల్పన శాఖ అధికారి కౌశిక్ వెంకటరమణకు జిల్లా ఇన్‌చార్జి అధికారిగా నియమించారు. ఆయన బాధ్యతలు చేపట్టిన తర్వాత కూడా ఇంకా గాడిలో పడలేదు. కార్యకలాపాలు కూడా సరిగా జరగడం లేదనే విమర్శలున్నాయి. స్వయంగా ఔట్‌సోర్సింగ్ కమిటీలకు చైర్మన్ అయిన కలెక్టర్ దీనిపై దృష్టి సారించాలనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతుంది.

ఏజెన్సీలపై స్పష్టత లేదు..



జిల్లాలో ఎంప్యానల్‌మెంట్‌లో లేని ఏజెన్సీలు ఉన్నాయా.. లేవా అనే విషయంలో నా దగ్గర వివరాలు లేవు. ఎంప్యానల్మెంట్ తిరిగి కొత్తగా నియమించే విషయంలో కమిటీకి చైర్మన్‌గా ఉన్న కలెక్టర్‌కే పూర్తి విచక్షణ అధికారాలు ఉంటాయి.– కౌశిక్ వెంకటరమణ, జిల్లా ఇన్‌చార్జి ఉపాధికల్పన శాఖ అధికారి

- 23 ఏళ్ల నిరీక్షణకు తెర
- సెర్ప్ ఉద్యోగులకు పేస్కేల్
- ఏప్రిల్ ఒకటి నుంచి అమల్లోకి
- ప్రభుత్వం ఉత్తర్వులు జారీ
- జిల్లాలో 154 మందికి లబ్ధి

కల సాకారం



సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న సెర్ప్ ఉద్యోగులు

పే స్కేల్‌తో లబ్ధి పొందనున్న సెర్ప్ ఉద్యోగుల వివరాలు :

ఎంఎస్‌సీఎస్	45
మాస్టర్ బుక్ కీపర్లు	22
కమ్యూనిటీ కోఆర్డినేటర్లు	47
అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్లు	23
డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ మేనేజర్లు	07
ప్రాజెక్ట్ మేనేజర్	01
అడ్మిన్ అసిస్టెంట్లు	06
ఆఫీస్ సబార్డినేట్‌లు	03

కైలాస్‌నగర్: పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)లో పనిచేస్తున్న ఉద్యోగుల 23 ఏళ్ల కల ఎట్టకేలకు సాకారమైంది. మహిళల జీవనోపాధి మెరుగుపర్చడంతో పాటు స్వయం సహాయక సంఘాల ఏర్పాటు చేయడం నుంచి సమావేశాల నిర్వహణ, ఐకమత్యం, ఆర్థిక పరిపుష్టి కోసం పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు పేస్కేల్‌ను ప్రకటించింది. వారి వేతనాలు పెంచుతూ జీవో ఎంఎస్ నంబర్ 11ను జారీ చేసింది. ఏప్రిల్ 1నుంచి అమల్లోకి రానున్నట్లు ప్రకటించింది. ఈమేరకు జిల్లాలో 154మందికి లబ్ధి చేకూరనుంది.

పెరగనున్న వేతనాలు

స్వయం సహాయక సంఘాల ఆర్థికాభివృద్ధిలో సెర్ప్ ఉద్యోగుల పాత్ర కీలకం. మహిళా సంఘాల ఏర్పాటు నుంచి, సమావేశాల నిర్వహణ, బ్యాంకుల ద్వారా రుణాల మంజూరు, చెల్లింపులు సక్రమంగా నిర్వహించేలా కృషి చేస్తున్నారు. అంతే కాకుండా మహిళలు చిరు వ్యాపారాలు చేసుకునేదిశగా ప్రోత్సహిస్తూ వారి ఆర్థిక పరిపుష్టికి తమవంతు తోడ్పాటు నందిస్తున్నారు. వీరి సేవలను పరిగణలోకి తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. కనిష్ట వేతనం రూ.19వేల నుంచి రూ.58,850కు, గరిష్ట వేతనం రూ.51,320 నుంచి రూ.1.27,310కు పెరగనుంది. తెలంగాణ సర్కారు నిర్ణయంపై సెర్ప్ ఉద్యోగుల్లో ఆనందోత్సహాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం



సెర్ప్‌లో 23 ఏళ్లుగా పనిచేస్తున్నాం. రెగ్యులర్ చేయాలని కోరుతూ చేయని ప్రయత్నమంటూ లేదు. గత ప్రభుత్వాలు హామీలిచ్చినా అమలు చేయలేదు. కానీ సీఎం కేసీఆర్ మాత్రం హామీ ఇచ్చినట్లుగా పేస్కేల్ ప్రకటించడం సంతోషంగా ఉంది. ప్రభుత్వానికి ఎప్పుడూ రుణపడి ఉంటాం.

–షుద్దోద్దీన్, సెర్ప్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు

ఆర్థిక ఇబ్బందులు తొలగనున్నాయి



ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో పనిస్తున్నాం. మా సేవలను ప్రభుత్వం ఎట్టకేలకు గుర్తించి పేస్కేల్ ప్రకటించడం సంతోషంగా ఉంది. తాజా నిర్ణయంతో తమ ఆర్థిక ఇబ్బందులు తొలగనున్నాయి. మహిళా సంఘాల పటిష్టానికి మా వంతు కృషి చేస్తున్నాం. భవిష్యత్తులోనూ మరింత బాధ్యతాయతంగా పనిచేస్తాం.

– గంగన్న, సీసీల యూనియన్ జిల్లా అధ్యక్షుడు

పెట్టుబడి బారెడు.. రుణం మూరెడు



నాపేరు బొంత నితిన్. భీంపూర్ మండలం అర్లి(టి) గ్రామం. 13 ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నా. గతేడాది పత్తి, కందులు వేసిన. దుక్కిదున్నే మొదలు పంట చేతికొచ్చేవరకు పెట్టుబడి భారం పెరిగిపోయింది. ఎరువులు, పురుగు మందులు, కూలీలు, రవాణా.. ఇలా అన్ని ఖర్చులు రెట్టింపయ్యాయి. ఈ పరిస్థితుల్లో బ్యాంకుల నుంచి ఇచ్చే రుణం ఎటూ సరిపోవడం లేదు. ఇది మరింత పెంచి ఉంటే బయట అప్పు చేసే పరిస్థితి ఉండదు.



నాపేరు అయిటి నర్సింగ్. భీంపూర్ మండలం పిప్పల్ కోటి గ్రామం. పత్తి, సోయాబీన్ పంటలు సాగు చేస్తాను. పత్తికి రుణ పరిమితిని గతేడాదితో పోల్చితే ఈ సారి కొంత పెంచారు. అయితే ఎకరానికి రూ.60వేల వరకు పెంచి ఉంటే ప్రయోజనం దక్కేది. ఈ దిశగా ప్రభుత్వాలు, బ్యాంకర్లు ఆలోచన చేయాలి. రైతుకు పెట్టుబడి భారం కాకుండా చూడాలి.



పత్తి చేను

- రుణ పరిమితి పెంచినా రైతుల్లో నిట్టూర్పు
- మరింత పెంచితే బాగుండన్న అభిప్రాయం
- జిల్లాలో పత్తి, సోయా సాగే అధికం

సాక్షి,ఆదిలాబాద్: రానున్న వ్యవసాయ సీజన్ 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ (రుణ పరిమితి)ని తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంక్ (టిస్కాబ్) ఖరారు చేసింది. జిల్లాలో అత్యధికంగా సాగు చేసే పత్తి, సోయాబీన్‌తో పాటు ఇతర పంటలకు సంబంధించి వీటిని ప్రకటించింది. కొన్ని పంటలకు మాత్రమే గతేడాదితో పోల్చితే ఈ సారి పెంచారు. పత్తి, సోయాబీన్‌కు సంబంధించి రుణ పరిమితి మరింత పెంచితే ప్రయోజనం దక్కేదన్న అభిప్రాయం రైతుల నుంచి వినబడుతుంది. పెట్టుబడి కోసం బ్యాంక్ రుణం తీసుకోగా, అవి సరిపోకపోవడంతో ప్రైవేట్ అప్పుచేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్న ఆందోళన వారిలో కనిపిస్తుంది.

పత్తి, సోయా సాగే అధికం..

జిల్లాలో వానకాలంలో పత్తి సుమారు 4లక్షల 15వేల ఎకరాల వరకు, సోయాబీన్ సుమారు లక్ష ఎకరాల వరకు సాగవుతుంది. జిల్లా సాగు విస్తీర్ణంలో ఈ రెండు పంటల విస్తీర్ణమే అధిక శాతం.

- నీటి వసతి లేనిచోట ఎకరంలో పత్తి సాగుకు సంబంధించి గతేడాది రుణ పరిమితి రూ.38వేల నుంచి రూ.40వేల వరకు ఉండగా, ఈసారి రూ.42వేల నుంచి రూ.45వేల వరకు పెంచారు.
- సోయాబీన్‌కు సంబంధించి గతేడాది రూ.24వేల నుంచి రూ.26వేలు ఉండగా, తాజాగా రూ.26వేల నుంచి రూ.28వేల వరకు పెంచారు.
- కందులకు రూ.16వేల నుంచి రూ.19వేలు ఉండగా, రూ.18వేల నుంచి రూ.21 వేలకు పెంచారు.
- శనగకు రూ.24వేలనుంచి రూ.26వేలకు పెంచారు. అలాగే మొక్కజొన్నకు రూ.24వేల నుంచి రూ.26వేలు ఉండగా, రూ.26 వేల నుంచి రూ. 28వేలకు పెంచారు.
- ఆయిల్‌పామ్ సాగుకు గతేడాది మాదిరిగానే రూ.40వేల నుంచి రూ.42వేల వరకు ఖరారు చేశారు. ప్రధానంగా సాగు ఖర్చు, ఉత్పాదకత, నీటి వసతి అంశాలను పరిగణలోకి తీసుకొని ఖరారు చేశారు.

పల్లెపల్లెనా మార్కెట్

- గ్రామాల్లో ఇక వారసంతల ఏర్పాటు
- ఈజీఎస్ నిధులతో షెడ్ల నిర్మాణం
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- జీపీలకు సమకూరనున్న ఆదాయం

కైలాస్‌నగర్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం తాజాగా గ్రామీణ ప్రాంతాల్లో వారసంతలు (అంగళ్లు) నిర్వహించుకునేందుకు అవకాశం కల్పిస్తోంది. ఇందుకు సంబంధించిన షెడ్‌లను ఈజీఎస్ నిధులతో నిర్మించుకునే వెసులుబాటు కల్పించింది. మేజర్ పంచాయతీలకు రూ.15లక్షలు, చిన్న పంచాయతీలకు రూ.12లక్షలు కేటాయించనున్నట్లుగా పేర్కొంటూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిధుల్లో పంచాయతీలను సైతం భాగస్వాములను చేసింది. ప్రభుత్వ తాజా నిర్ణయాన్ని పంచాయతీలు సద్వినియోగం చేసుకుంటే అక్కడి ప్రజలకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు, స్థానికులకు తాజా పండ్లు, కూరగాయలు ఇతరత్రా తినుబండారాలు లభించడంతో పాటు పంచాయతీలకు సైతం అదనపు ఆదాయం సమకూరే అవకాశముంది.

చొరవ చూపితేనే ప్రయోజనం

గ్రామాల్లో వారసంతలు (అంగళ్లు) నిర్వహించుకునేందుకు వీలుగా ఉపాధి హామీ పథకం కింద షెడ్ల నిర్మాణాల కోసం ప్రభుత్వం నిధులు కేటాయిస్తోంది. ఆయా గ్రామాల్లోని ప్రజలకు పండ్లు, కూరగాయలు, తినుబండరాలు, ఇతరాత్ర సామగ్రిని విక్రయించేందుకు వీలుగా ఈ నిధులతో వసతులు కల్పించనుంది. అయితే పంచాయతీ ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు ప్రత్యేక చొరవ తీసుకుంటే ఆయా గ్రామస్తులకు త్వరితగతిన ఈ సంతలు అందుబాటులోకి వచ్చే అవకాశముంది. అంగళ్ల నిర్వహణకు ప్రభుత్వం రెండు విధాలా మౌలిక వసతులు కల్పించాలని నిర్ణయించింది. గ్రామజనాభా, స్థలం, నిధుల లభ్యత ప్రకారంగా 20, 30 గదులను నిర్మించుకునేలా అవకాశం కల్పించారు. 30 గదులకు రూ.15లక్షలు, 20 గదులకు రూ.12.5 లక్షలను ప్రభుత్వం కేటాయించనుంది. ఇందులో పంచాయతీలు సైతం తమ భాగస్వామ్యంగా నిధులు వెచ్చించాల్సి ఉంటుంది. ఈ నిధులతో ప్లాట్‌ఫాం, నీటివసతి, మూత్రశాలలు, డ్రెయినేజీలు పార్కింగ్ స్థలం అభివృద్ధి వంటి పనులు నిర్వహించాల్సి ఉంటుంది.

ఆదాయం సైతం..

జిల్లాలో ప్రస్తుతం మేజర్ పంచాయతీలు, మండల కేంద్రాల్లోని పంచాయతీలైన ఇచ్చోడ, ఇంద్రవెల్లి, భీంపూర్, బేల, నార్నూర్, బోథ్, ఉట్నూర్, నార్నూర్ వంటి ప్రాంతాల్లో వారసంతలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వం తాజాగా ప్రతీ పంచాయతీలోనూ మార్కెట్ సౌకర్యం కల్పించాలని నిర్ణయించడంతో ఇప్పటివరకు సంతలు లేని గ్రామాల్లో వాటిని నిర్మించేందుకు మార్గం సుగమమైంది. దీనిద్వారా ఆయా గ్రామస్తులకు తాజా కూరగాయలు, పండ్లు లభించనున్నాయి. వారసంతల నిర్వహణ ద్వారా గ్రామ పంచాయతీలు అదనపు ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చు. వేలం స్థలాన్ని కేటాయించడంతో పాటు అంగళ్లలో విక్రయాలు సాగించే వారి నుంచి పన్నులు వసూలు చేయడం ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూరుతుంది. ఇప్పటికే కొన్ని పంచాయతీల్లో తైబజార్ పేరిట పన్నులను వసూలు చేస్తున్నారు. ఇలా ఆదాయం సమకూరనుంది. ఆదిశగా మిగతా పంచాయతీలు సైతం దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



భీంపూర్ మండలకేంద్రంలోని వారసంత

వివరాలు	మేజర్ పంచాయతీ	చిన్న పంచాయతీ
పంచాయతీకి కేటాయించే నిధులు	రూ.15లక్షలు	రూ.12.5లక్షలు
ఇందులో ఉపాధిహామీ నిధులు	రూ.10 లక్షలు	రూ.9 లక్షలు
పంచాయతీ చెల్లించాల్సిన నిధులు	రూ.5లక్షలు	రూ.3.5లక్షలు

జిల్లాలోని మొత్తం పంచాయతీలు 468

క్లుప్తంగా

హ్యాండ్‌బాల్ ఆణిముత్యం.. మౌనిక

- 'జాతీయస్థాయి'కి ఎంపిక
- బరేలిలో ప్రారంభమైన పోటీలు


ఎం మౌనిక, గురుకులం విద్యార్థిని

నార్నూర్: ఓ వైపు నిరుపేద కుటుంబం.. మరోవైపు సౌకర్యాలు సైతం అంతంతే.. అయినా హ్యాండ్‌బాల్ క్రీడపై ఉన్న మక్కువతో రాణిస్తూ అంచెలంచెలుగా ఎదుగుతోంది ఈ విద్యార్థిని. ఇప్పటికే జిల్లా, రాష్ట్రస్థాయిలో సత్తా చాటగా తాజాగా జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది మండలకేంద్రంలోని ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఎం.మౌనిక. ఈ నెల 22 నుంచి 26 వరకు ఉత్తరప్రదేశ్‌లోని బరేలిలో నిర్వహించనున్న జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించనున్నట్లు పీఈటీ అనూష తెలిపారు. ఇటీవల హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చడంతో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. మౌనికను ప్రిన్సిపాల్ ఉపేందర్, ఉపాధ్యాయులు అభినందించారు.

తుడుందెబ్బ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ


కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: ఆదివాసీ యువతి జుగ్నక్ రేణుక మృతికి కారకుడైన లావుడ్యా రమేష్‌కు వెంటనే ఉరిశిక్ష వేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) ఆదిలాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో బుధవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు గోడం గణేష్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని వర్గాల మహిళలపై అత్యాచారాలు, హత్యలు, యాసిడ్ దాడులతో పాటు వరకట్న వేధింపులు, భ్రూణహత్యలు యథేచ్ఛగా జరుగుతున్నప్పటికీ పాలకులు, అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. జుగ్నక్ రేణుక నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రిలో మరణిస్తే కనీసం పోస్టుమార్టం చేయకుండా శవాన్ని ఎలా బయటకి తెస్తారని ప్రశ్నించారు. ఆమె మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి దర్యాప్తు చేసి మృతురాలి కుటుంబంలో ఒకరికి ఉద్యోగంతో పాటు రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉయిక సంజీవ్, ఆదివాసీ మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు గోడం రేణుక, జిల్లా ఉపాధ్యక్షులు ఉయిక ఇందిరా, నాయకులు ఆత్రం శేషు, మడావి గణేష్, బి.రా హుల్, మెస్రం గంగాదేవి, కుంరం శాంతబాయి, ఆత్రం గణపతి, వేడామ ముకుంద్ పాల్గొన్నారు.

మూడోసారీ వాయిదా..

- మున్సిపల్ వార్షిక బడ్జెట్ సమావేశానికి కౌన్సిలర్ల గైర్హాజరు
- అవిశ్వాసానికి దారితీస్తుందని గుసగుసలు
- చర్చనీయాంశంగా మారిన ఖానాపూర్ మున్సిపల్ తీరు..


హాజరైన చైర్మన్, కమిషనర్, అధికారులు

ఖానాపూర్: ఖానాపూర్ మున్సిపల్ రాజకీయాలు కొత్త మలుపులకు దారి తీస్తున్నాయి. నెలరోజుల్లో వరుసగా మూడోసారి బడ్జెట్ సమావేశం వాయిదా పడడమే ఇందుకు కారణంగా కనిపిస్తోంది. సమావేశానికి మున్సిపల్ చైర్మన్ మినహా కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్లతో పాటు అధికార పార్టీ కౌన్సిలర్లు సైతం గైర్హాజర్ కావడం చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రంలో ఇప్పటికే సుమారు 30కి పైగా మున్సిపాలిటీల్లో అవిశ్వాస తీర్మానాలకు తెరలేపారు. ఖానాపూర్‌లో సైతం కౌన్సిలర్ల గైర్హాజరు తీరు అవిశ్వాస తీర్మానానికి దారితీస్తుందని చర్చలు జోరుగా సాగుతున్నాయి. పది రోజుల వ్యవధిలో మూడుసార్లు సమావేశం వాయిదా పడింది. మొదట ఈ నెల 9న జరగాల్సిన సమావేశం అనివార్య కారణాలతో వాయిదా పడింది. రెండోసారి 18న ప్రతిపక్ష, అధికార పార్టీ కౌన్సిలర్లు రాకపోవడంతో వాయిదా పడింది. ఈ నెల 21న మంగళవారం సైతం మూడోసారి జరగాల్సిన సమావేశానికి చైర్మన్‌తో పాటు కమిషనర్, అధికారులు మాత్రమే హాజరుకావడంతో సమావేశం వాయిదా పడింది. ప్రతీ సంవత్సరం మార్చిలో నిర్వహించాల్సిన అత్యంత ముఖ్యమైన వార్షిక బడ్జెట్ సమావేశానికి సభ్యుల గైర్హాజరు కావడంపై చర్చోపచర్చలు సాగుతున్నాయి. ఈ విషయమై కమిషనర్ రత్నాకర్‌రావును వివరణ కోరగా కోరం లేని కారణంగా సమావేశాలన్నీ వాయిదా వేసినట్లు తెలిపారు. ప్రతిపక్ష పార్టీల కౌన్సిలర్లు మాత్రం గతంలో వరుసగా జరిగిన బడ్జెట్ సమావేశాల్లో కేటాయించిన నిధుల ఖర్చు వివరాలు తెలపకపోవడంతోనే గైర్హాజర్ అవుతున్నామని ప్రకటిస్తున్నారు.

ప్రతిపక్ష, స్వపక్షాలదీ అదేబాట..

ఖానాపూర్‌లో ప్రతిపక్ష కౌన్సిలర్లతో పాటు స్వపక్ష కౌన్సిలర్లు బడ్జెట్ సమావేశానికే గైర్హాజరు అవుతున్నారు. మున్సిపాలిటీలో 12 మంది కౌన్సిలర్లు ఉన్నారు. వారిలో ప్రస్తుతం అధికార బీఆర్‌ఎస్‌కు ఏడుగురు, కాంగ్రెస్‌కు నలుగురు, బీజేపీకి ఒక కౌన్సిలర్ ఉన్నారు. రెండోవార్డు కౌన్సిలర్ కాంగ్రెస్ నుంచి గెలిచి బీఆర్‌ఎస్‌లో చేరారు. కోఆప్షన్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ బలపర్చిన అభ్యర్థులకు ఓటు వేయడంతో కాంగ్రెస్ కౌన్సిలర్లు రెండవ వార్డు కౌన్సిలర్‌ను పదవి నుంచి తొలగించాలని హైకోర్టులో కేసు వేశారు. 11మంది కౌన్సిలర్లలో చైర్మన్ మినహా పది మంది బడ్జెట్ సమావేశానికి గైర్హాజర్ అవుతున్నారు. దీంతో అవిశ్వాసానికి దారితీసినట్టేనా? అని ప్రజల్లో చర్చ జరుగుతోంది.

బహుజన రాజ్య స్థాపనే లక్ష్యం


పార్టీ కండువా కప్పుతున్న సందీప్

కైలాస్‌నగర్: బహుజనుల రాజ్యాధికార స్థాపనే లక్ష్యంగా వంచిత్ బహుజన్ అఘాడి పార్టీ కృషి చేస్తుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సందీప్ దాంఢ్గే అన్నారు. జిల్లా కేంద్రంలోని రణదివే నగర్‌లో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు కాలనీవాసులు ఆయన సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడారు. అంబేద్కర్ మనవడు ప్రకాశ్ అంబేద్కర్ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం వంచిత్ బహుజన్ అఘాడి పార్టీని స్థాపించారని గుర్తు చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను ఏకతాటిపైకి తీసుకొచ్చి అంబేద్క ర్ ఆశయాలు నెరవేర్చడమే పార్టీ ముఖ్య ఉద్దేశమన్నారు. అనంతరం మహిళా అఘాడి కమిటీని ఎన్నుకున్నారు. ఇందులో మహిళా అఘా డి జిల్లా అధ్యక్షులు వర్ష కాంబ్లె, ఆదిలాబాద్ ని యోజకవర్గ ఇన్‌చార్జి పంచశీల్ గుళవే పాల్గొన్నారు.

దుకాణంలో అగ్ని ప్రమాదం

కుంటాల(ముధోల్): మండలంలోని ఓలా గ్రామానికి చెందిన వెల్పూర్ రంజిత్ వడ్రంగి దుకాణంలో బుధవారం తెల్లవారుజామున అ గ్నిప్రమాదం సంభవించింది. గమనించిన స్థానికులు మంటలను ఆర్పివేశారు. ప్రమాదంలో విద్యుత్ మీటర్, కర్రతో పాటు రూ. లక్ష వి లువ చేసే సామగ్రి దగ్ధమైనట్లు బాధితుడు తె లిపాడు. సంఘటన స్థలాన్ని విద్యుత్ అధికారులు పరిశీలించి పంచనామా నిర్వహించారు.

ఇప్పుడే వస్తానని వెళ్లి మృత్యువాత

- రెండు బైక్‌లు ఢీకొని ఒకరి మృతి
- మరొకరికి తీవ్ర గాయాలు
- పండుగ పూట విషాదం


సంఘటన స్థలంలో రోదిస్తున్న కుటుంబ సభ్యులు

భీమిని: ఇప్పుడే వస్తానని ఇంటి నుంచి వెళ్లిన కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. ఉగాది పండుగ పూట కన్నవారికి కడుపుకోత మిగిల్చాడు. ఈ సంఘటన మంచిర్యాల జిల్లా కన్నెపల్లి మండలం రెబ్బెన గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. రెబ్బెన గ్రామానికి చెందిన గోమాస భీమయ్య, గౌతమి దంపతులకు ఐదుగురు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు గోమాస రఘు(17) ద్విచక్ర వాహనంపై కిరాణ దుకాణం ప్రారంభానికి వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. రెబ్బెన–కుశ్నపల్లి క్రాస్ రోడ్డు వద్ద ఎదురుగా వస్తున్న మరో మోటారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో రఘు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందగా, మరో మోటార్ సైకిల్‌పై ఉన్న ఉంద్రుగుల ప్రసాద్, గోమాస రవి గాయపడ్డారు. ప్రసాద్ కుడి కాలు విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని 108అంబులెన్స్‌లో మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని చేరుకున్న కుటుంబ సభ్యులు మృతదేహం వద్ద గుండెలు బాదుకుంటూ రోదించిన తీరు అక్కడ ఉన్న వారిని కంటతడి పెట్టించింది. మృతుడి తండ్రి భీమయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు.

మైనర్ల వేగం.. పెద్దలకు శోకం..!

- మోటార్‌సైకిళ్లపై దూసుకెళ్తున్న బాలలు
- తల్లిదండ్రులు, పోలీసులు దృష్టి సారిస్తేనే భద్రత


త్రిబుల్ రైడ్ చేస్తున్న మైనర్లు

నెన్నెల: ఏ తల్లిదండ్రులకైనా పిల్లలే సర్వస్వం. వారిపై అతి ప్రేమో.. అవగాహన రాహిత్యమో గానీ మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇస్తూ సంబర పడిపోతున్నారు. కంటిపాపల్లా కాపాడుకోవాల్సిన బాలలను ప్రమాదంలో పడేయడంతోపాటు ఎదుటి వారి ప్రాణాలకు ముప్పు తెస్తున్నారు. బుధవారం కన్నెపల్లి మండలం రెబ్బెన గ్రామంలో బాలుడు(17) అతివేగంగా మోటార్‌సైకిల్ నడిపిస్తూ వెళ్లి ఎదురుగా వచ్చిన మరో మోటార్‌సైకిల్‌ను ఢీకొట్టడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మరో మరో మోటార్‌సైకిల్‌పై ఉన్న యువకుడికి కాలు విరిగింది. పల్లెల నుంచి పట్టణ ప్రాంతాల్లో జరిగే ప్రతీ నాలుగు ఐదు రోడ్డు ప్రమాదాల్లో ఒకటి మైనర్ల వల్లేనని గణంకాలు చెబుతున్నాయి. నేటి సాంకేతిక యుగం పిల్లలు వాహనాలపై ప్రత్యేక ఆసక్తి చూపిస్తున్నారు. కొందరు తల్లిదండ్రులు వద్దని చెబుతున్నా వినకుండా నడిపిస్తున్నారు. దీంతో తమ అమూల్యమైన ప్రాణాలు కోల్పోవడంతోపాటు తల్లిదండ్రులకు శోకం మిగుల్చుతున్నారు. మరికొందరు తల్లిదండ్రులు స్వయంగా డ్రైవింగ్ నేర్పిస్తున్నారు. ఇటీవల పల్లెలు, పట్టణాల్లో బాలురు వాహనాలు నడపడం ఎక్కువగా కనిపిస్తోంది. సైకిళ్లు నడపాల్సిన వయస్సులో ద్విచక్ర వాహనాలపై పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు వెళ్తున్న విద్యార్థులు చాలామంది ఉన్నారు. తల్లిద్రండులే పిల్లలకు వాహనాలు ఇచ్చి దుకాణాలు, మార్కెట్‌లో సరుకులు కొనుగోలు చేయాలని పంపిస్తున్నారు. కొందరు తల్లిదండ్రులైతే తమ కుమారుడు వాహనం నడుపుతున్నాడని గర్వంగా చెప్పుకుంటున్నారు. పిల్లలకు వాహనం ఇవ్వడం నేరమని తెలిసి తప్పు చేస్తున్నారు. పిల్లలు ద్విచక్ర వాహనంపై వాయువేగంతో వెళ్తున్నా పట్టించుకోవడం లేదు. పోలీసులు ప్రత్యేకంగా దృష్టి సారిస్తే కొంతవరకు ప్రమాదాలు నివారించవచ్చని ప్రజలు పేర్కొంటున్నారు. పిల్లలకు వాహనాలు ఇస్తే ప్రమాదాల బారిన పడి ఇబ్బందులు పడక తప్పదు అని తల్లిదండ్రులు గ్రహించాలి. వాహనాలతో పాఠశాలలు, జూనియర్ కాలేజీలకు రాకుండా విద్యాసంస్థలు కూడా బాధ్యత తీసుకోవాలి. విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. అప్పుడే కొంత మేర ప్రమాదాలు తగ్గుతాయి. మైనర్లు ప్రమాదానికి గురి చేస్తే వాహన యజమానిపై కేసు నమోదు చేస్తారు. జైలు శిక్ష కూడా అనుభవించాల్సి ఉంటుంది. రూ.25 వేల వరకు జరిమానా విధించే అవకాశం కూడా ఉంటుంది. ఇది గ్రహించి తల్లిదండ్రులు ఆలోచించాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.

ప్రభుత్వ భూమి కబ్జాపై పట్టింపేది..!

- కిష్టాపూర్ గ్రామంలో వెలిసిన ప్లాట్లు
- గుడిసెలు వేసేందుకు యత్నం
- సింగరాయిపేట ఆక్రమణదారులపై వేటుకు ఆందోళన
- ఎస్సై సర్ది చెప్పడంతో గ్రామస్తుల వాయిదా


భూమిలో గుడిసెలు వేసుకుంటున్న కిష్టాపూర్ గ్రామస్తులు

జన్నారం: ప్రభుత్వ భూములు, చెరువు భూముల కబ్జాలపై అధికారులకు పట్టింపు కరువైంది. ఆక్రమణలపై ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదని ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ క్రమంలో అధికారుల తీరుపై నిరసనకు సిద్ధం అవుతున్నారు. ఒక గ్రామానికి చెందిన వారు ప్రభుత్వ భూమిలో ప్లాట్లు ఏర్పాటు చేసి గుడిసెలు వేసుకునేందుకు సిద్ధం అవుతుండగా, సింగరాయిపేట గ్రామ శివారులోని చెరువు భూమి అక్రమ పట్టా చేసుకున్న వారిపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తూ తపాలపూర్ గ్రామానికి చెందిన ప్రజలు, రైతులు రాస్తారోకో, ఆందోళనలకు సిద్ధం అవుతున్నారు.

విచారణ సరే.. చర్యలేవి..?

సింగరాయిపేట గ్రామ చెరువులో శిఖం భూమి సర్వే నంబర్ 147/11, 147/6లో 7.20 ఎకరాలు అధికార పార్టీకి చెందిన ఇద్దరు వ్యక్తులు వారి కుటుంబీకుల పేర్లతో అక్రమ పట్టా చేసుకున్నారని గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. అధికారులు స్పందించి విచారణ చేపట్టి అక్రమ పట్టా అని తేల్చినా చర్యలు తీసుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చర్యలు తీసుకోవాలనే డిమాండ్‌తో ఈ నెల 24న ఆందోళన నిర్వహణకు తీర్మానించారు. కిష్టాపూర్ శివారులోని సర్వే నంబర్ 139/అ1/1లో రెండెకరాలు కిష్టాపూర్ గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకుడు అక్రమంగా పట్టా చేసుకున్నారని ఆరోపిస్తూ ఇదివరకే ఆ గ్రామానికి చెందిన పలువురు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. కిష్టాపూర్ చెరువు శిఖం భూమి కూడా సర్వేనంబర్ 298/ఆలో 6.13 ఎకరాలు, 298/ఇ లో 0.30 ఎకరాల భూమిని మరో అధికార పార్టీకి చెందిన నాయకుడు అక్రమ పట్టా చేయించుకున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వీటిపై అధికారులు విచారణ చేపట్టడం లేదని ఆరోపిస్తున్నారు. ఆ భూమిలో కిష్టాపూర్ గ్రామానికి చెందిన కొందరు బుధవారం ఉగాది రోజున 30 ప్లాట్లు 30 మంది నిరుపేదలకు ఇళ్ల నిర్మాణం కోసం ఏర్పాటు చేసుకున్నట్లు తెలిసింది.

గుడిసెలు వేసే అవకాశం

కిష్టాపూర్ పల్లె ప్రకృతి వనం ఎదురుగా ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకునేందుకు గ్రామస్తులు సిద్ధమయ్యారు. అధికార పార్టీ నాయకుడు వారి కుటుంబీకుల పేరున అక్రమ పట్టా చేయించుకుని రైతుబంధు పొందుతున్నాడని ఆరోపిస్తున్నారు. ఆ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలేని, లేనిపక్షంలో గుడిసెలు వేసుకుంటామని కిష్టాపూర్‌కు చెందిన దళిత నిరుపేదలు బుధవారం సాయంత్రం 7గంటల ప్రాంతంలో ప్రయత్నించారు. తహసీల్దార్ వెంకటకిషన్ ఇచ్చిన సమాచారం మేరకు ఎస్సై తానాజీనాయక్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. గ్రామస్తులకు సర్ది చెప్పి.. అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని సూచించడంతో నిర్మాణం నిలిపారు. అధికారులు సమస్య పరిష్కరించని పక్షంలో ఇళ్లు నిర్మించుకుంటామని స్పష్టం చేశారు.

కేసులు నమోదు చేస్తాం

ప్రభుత్వ భూమిని ఎవరు ఆక్రమించుకున్నా ఊరుకునేది లేదు. పల్లె ప్రకృతి వనం ఎదురుగా భూమిని ఐటీఐ నిర్మాణం కోసం కేటాయించాం. అక్రమ పట్టా జరిగినట్లు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో విచారణ చేస్తున్నాం. తొందరపడి ప్రభుత్వ భూమి ఆక్రమణకు ప్రయత్నిస్తే ఎవరైనా కేసులు నమోదు చేయిస్తాం.

– వెంకటకిషన్, తహసీల్దార్

బాసర ఆలయంలో ఉగాది వేడుకలు


పంచాంగం ప్రదర్శిస్తున్న అర్చకులు

భైంసా(ముధోల్): బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో బుధవారం ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. శోభకృత్ నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకుని ఆలయ వైదికులు బ్రహ్మ ముహూర్తంలో అమ్మవార్లకు వివిధ ఓషధులతో విశేష అభిషేకం, మహా నీరాజన మంత్రపుష్ప సేవ పంచాంగ బ్రహ్మధ్వజ పూజలు చేశారు. ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని అమ్మవారికి పూజలు చేశారు.

'శోభకృత్ శుభాలు చేకూర్చాలి'

శోభకృత్ నామ సంవత్సరం అందరికీ శుభాలు చేకూర్చాలని ఆర్జీయూకేటీ వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ అన్నారు. ఉగాదిని పురస్కరించుకుని వర్సిటీ ఉద్యోగులు, విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు ఉన్నతంగా రాణించాలని ఆశించారు.

బాసర ఆలయంలో పంచాంగ శ్రవణం

భైంసా: బాసర శ్రీ జ్ఞాన సరస్వతి ఆలయంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం సాయంత్రం పంచాంగ శ్రవణం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్, గ్రామస్తుల, భక్తులు పాల్గొన్నారు.

రైతులకు బ్యాడ్మింటన్ పోటీలు


బ్యాడ్మింటన్ పోటీల అనంతరం రైతులు

సారంగపూర్: నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం కౌట్ల(బి) గ్రామంలో ఉగాది సందర్భంగా రైతులకు బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. మూడేళ్లుగా ఏటా పోటీలు నిర్వహిస్తుండగా.. బుధవారం నాటి పోటీల్లో దాదాపు 50మంది రైతులు తెలుపు రంగు దుస్తులు ధరించి పాల్గొన్నారు. ప్రతియేటా ఆటల పోటీలతోపాటు నూతన సాగు పనులు ప్రారంభించడం ఇక్కడ ఆనవాయితీగా వస్తోంది. అందరూ పోటీల్లో పాల్గొనడంతోపాటు పంచాంగ శ్రవణం తర్వాతే భోజనాలు చేస్తారు. ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, మాజీ డీసీఎంఎస్ అధ్యక్షుడు నారాయణరెడ్డి పాల్గొన్నారు.

బైక్ ఢీకొని బాలుడికి గాయాలు

కౌటాల(సిర్పూర్): బైక్ ఢీకొని ఐదేళ్ల బాలుడు గాయపడిన ఘటన బుధవారం కౌటాల మండల కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని మార్కెట్ కాలనీకి చెందిన దండిక వెంకటేశ్– కృష్ణవేణి దంపతులు బుధవారం చిన్న కుమారుడు విక్కితో కలిసి స్థానిక కోదండ రామాలయంలో నిర్వహించిన పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఇంటికి వెళ్తుండగా కౌటాల– బెజ్జూర్ రహదారి దాటుతున్న విక్కిని సదా శివపేట నుంచి కౌటాలకు వెళ్తున్న బైక్ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విక్కి కుడి కా లు విరగగా, తలకు బలమైన గాయమైంది. అలాగే బైక్‌పై ఉన్న చకినల ఉమేశ్ స్వల్పంగా గాయపడినట్లు స్థానికులు తెలిపారు. విక్కిని అతడి తల్లిదండ్రులు వైద్యం కోసం కాగజ్‌నగర్ ఆస్పత్రికి తీసుకెళ్లగా, వైద్యుల సూచనల మేరకు మంచిర్యాలకు తరలించారు.

మద్యానికి బానిసగా మారి ఆత్మహత్య

సారంగపూర్: మండలంలోని చించోలి(బి) గ్రామానికి చెందిన కూచర్ల సాయిరాజ్(30) మంగళవారం అర్ధరాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. సాయిరాజ్‌కు ఐదేళ్ల క్రితం దిలావర్‌పూర్ గ్రామానికి చెందిన కూచర్ల సవితతో వివాహం జరిగింది. గత కొంతకాలంగా సాయిరాజ్ మద్యానికి బానిసగా మారి ఏ పనీ చేయడం లేదు. నిత్యం మద్యం సేవించి ఇంటికి రావడంతో భరించలేని ఆయన భార్య పలుమార్లు మందలించింది. అతడిలో మార్పు రాకపోవడంతో గతేడాది క్రితం తన పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి తన భార్యను కాపురానికి రావాలని పలుమార్లు కోరాడు. మద్యం సేవించడం మానేస్తేనే వస్తానని చెప్పడంతో మనస్తాపం చెంది సాయిరాజ్ ఇంట్లో ఉరేసుకున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై వసంత్ తెలిపారు.

రిటైర్డ్ ప్రిన్సిపాల్‌కు డాక్టరేట్


నీలం సంపత్ కుమార్

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని ఎస్‌కేఈ డిగ్రీ కళాశాల (ప్రస్తుత ప్రభుత్వ డిగ్రీ కళాశాల) ప్రిన్సిపాల్‌గా సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన నీలం సంపత్ కుమార్ కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి ఈనెల 23న డాక్టరేట్ పట్టా పొందనున్నారు. ఈ మేరకు విశ్వవిద్యాలయం నుంచి ఆహ్వానం అందుకున్నారు. యూనివర్సిటీకి చెందిన వాణిజ్య విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ సాయిలు పర్యవేక్షణలో సంపత్ కుమార్ 'మార్కెటింగ్ ఆఫ్ పేపర్ ఇన్ ఇండియా– ఎ స్టడీ ఆఫ్ ది సిర్పూర్ పేపర్ మిల్లు' అనే అంశంపై పరిశోధనలు చేశారు.

బాల్యవివాహాన్ని అడ్డుకున్న అధికారులు


బాలికను సఖి కేంద్రానికి తరలిస్తున్న అధికారులు

కుంటాల(ముధోల్): అభం శుభం తెలియని పట్టుమని పదేళ్లు కూడా నిండని బాలికకు నిశ్చితార్థం జరిపించిన ఘటన మండలంలోని ఓలా గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కామారెడ్డి జిల్లా మద్దికుంట గరుగుల్ గ్రామానికి చెందిన శ్యామల–రాజు దంపతుల కుమార్తె (10)ని కుంటాల మండలంలోని ఓలా గ్రామానికి చెందిన యువకుడు (18)తో వివాహం జరిపించేందుకు పెద్దలు నిశ్చయించారు. బుధవారం వివాహం చేసేందుకు సిద్ధం కావడంతో విషయం తెలుసుకున్న ఎస్సై సాయి కిరణ్, సర్పంచ్ ఫాతిమా, ఐసీడీఎస్ సూపర్ వైజర్ లక్ష్మి గ్రామానికి వెళ్లి వివాహాన్ని అడ్డుకున్నారు. సదరు బాలికను నిర్మల్ జిల్లా కేంద్రంలోని సఖి కేంద్రానికి తరలించారు.

ఉగాది సంబురాలు

- వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టిన రైతులు
- ఆలయాల్లో పంచాంగ శ్రవణం


బోథ్: పంచాగాన్ని చదువుతున్న పండితుడు సంతోష్


సిరికొండ: రిమ్మ గ్రామంలో పూజలు చేస్తున్న రైతులు

ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా శోభకృత నామ సంవత్సర ఉగాది వేడుకలు బుధవారం సంబురంగా నిర్వహించుకున్నారు. నూతన సంవత్సరం సందర్భంగా రైతులు వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు. ఉదయాన్నే తమ పంటపొలాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎద్దులను అలంకరించి దుక్కిదున్నారు. గ్రామాల్లో పండితులు పంచాంగ శ్రవణాన్ని చదివి వినిపించారు. ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో జిల్లా వ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొంది.

బోథ్: మండల వ్యాప్తంగా ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్ తన చేనులో కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి దుక్కి దున్నారు.

ఉట్నూర్‌లో..

ఉట్నూర్: తొలి తెలుగు పండుగ వేడుకలు మండలంలో ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో పూజల అనంతరం పంచాగశ్రవణం నిర్వహించారు. మాజీ ఎంపీ, బీజేపీ నాయకుడు రాథోడ్ రమేశ్ ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. ఇందులో బీజేపీ జిల్లా కార్యదర్శి కొండెరి రమేశ్, మండల అధ్యక్షుడు కొలిపాక రాజశేఖర్, నాయకులు శ్రీరాంనాయక్, దేవిదాస్, రమణ, పర్శారాం, భాగ్యలక్ష్మి, రవి, భూపతి ఉన్నారు.

ఇంద్రవెల్లిలో...

ఇంద్రవెల్లి: ఆదివాసీ గ్రామాల్లో ఇంటింటా నుంచి సేకరించిన నవధాన్యాలతో సహపంక్తి భోజనాలు చేశారు. మండల కేంద్రంలో గుడిపాడ్వ పేరుతో గుడికట్టి పూజలు చేశారు. రైతులు ప్రత్యేక పూజల మధ్య వ్యవసాయ పనులు ప్రారంభించారు.

ఇచ్చోడలో...

ఇచ్చోడ: మండలంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలో మరాఠీ సంప్రదాయ గ్రామాల్లో వారివారి ఇళ్ల ఎదుట నూతన వస్త్రాలతో మామిడి, వేప ఆకులతో కలిపి జెండాలను (గుడి)లను ఆవిష్కరించారు.

ఏజెన్సీలో సంబురాలు

నార్నూర్: ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనులు ఉగాది ఉత్సవాలను నిర్వహించారు. ఉదయం సంప్రదాయ పూజలు చేశారు. వ్యవసాయ పనిముట్లను సిద్ధం చేసుకుని ఎద్దులను ఆలకరించారు. అనంతరం వ్యవసాయ పనులు ప్రారంభించారు. గ్రామ పటేళ్ల ఇంటి ఎదుట సహపంక్తి భోజనాలు చేశారు.

అన్నదానం...

ఆదిలాబాద్‌రూరల్: మావల, ఆదిలాబాద్ రూరల్ మండలంలో ఉగాది వేడుకలు సంబురంగా నిర్వహించుకున్నారు. మండలంలోని బంగారిగూడలో ఆదిలాబాద్ పట్టణానికి చెందిన బీసీ సంఘం నాయకుడు ఈర్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో బెస్ట్ ఫ్రెండ్స్ హెల్ప్ వెల్ఫేర్ సొసైటీ సహకారంతో పేద ప్రజలకు అన్నదానం చేశారు. ఇందులో సొసైటీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, ఉపాధ్యక్షుడు పాలకొండ శ్రీకాంత్, ఎండి బాబర్ బాయ్, కీర్తి, ప్రమోద్, ఆసిఫ్ అలీ, జంగిలి గంగన్న, మర్రి విజయ్ కుమార్, సనాతన హిందూ ఉత్సవ సమితి సభ్యులు సూర్యకాంత్, సంతోష్, శ్రీనివాస్ ఉన్నారు.

బజార్‌హత్నూర్‌లో...

బజార్‌హత్నూర్: మండలంలో అన్ని గ్రామాల్లో రైతులు ఉగాది పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. రైతులు వేకువజాము నుంచి పంట పొలంలో పూజలు నిర్వహించి వ్యవసాయ పనులను ప్రారంభించారు.

సంప్రదాయబద్ధంగా పూజలు..

సిరికొండ: మండలంలో సంప్రదాయబద్ధంగా వేడుకలు నిర్వహించుకున్నారు. వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు.

వేడుకలు నిర్వహించడం అభినందనీయం

నేరడిగొండ: అందరిని ఏకతాటిపైకి తీసుకొచ్చి ప్రతియేటా ఉగాది వేడుకలు నిర్వహించడం అభినందనీయని బోథ్ ఏఎంసీ చైర్మన్ రుక్మన్‌సింగ్ అన్నారు. కుప్టి గ్రామంలో సామాజిక కార్యకర్త కొయ్యాడి గంగయ్య ప్రతియేటా ఏర్పాటు చేసే ఉగాది పచ్చడి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఉగాది పచ్చడి అరగించారు. ఎంపీపీ రాథోడ్ సజన్, సర్పంచ్ ఓర్స రాజుయాదవ్, పీఏసీఎస్ చైర్మన్ మందుల రమేష్ పాల్గొన్నారు.

పంట చేలలో పూజలు...

తాంసి: తాంసి, భీంపూర్ మండలాల్లోని పలు గ్రామాల్లో ప్రజలు తెలుగు నూతన సంవత్సరాది శోభకృత్ నామ సంవత్సర వేడుకలను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. తాంసి మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయంతో పాటు నిపానిలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో సాయంత్రం ఆలయ కమిటీ తరఫున పంచాంగ శ్రవణం నిర్వహించారు. భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి గ్రామంలో స్థానికులు ఉంగరాల ఆటను ఆడారు.

తలమడుగు: మండలంలోని అన్ని గ్రామాల్లో ఉగాది వేడుకలను సంబురంగా నిర్వహించుకున్నారు. ఆలయాల్లో పూజలు నిర్వహించి వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు. ఆలయాల్లో పంచాంగ శ్రవణం వినిపించారు.


ఇంద్రవెల్లి: సాకేరలో వ్యవసాయ పనులు ప్రారంభిస్తున్న రైతు


తాంసి: పూజలు నిర్వహిస్తున్న రైతులు


నార్నూర్: ఎద్దులకు నైవేద్యం తినిపిస్తూ..


ఆదిలాబాద్‌రూరల్: అన్నదానం చేస్తున్న సభ్యులు


ఉట్నూర్: ఉగాది పచ్చడి పంచుతున్న నాయకులు


తలమడుగు: పంచాంగ శ్రవణం చేస్తున్న పూజారి


నేరడిగొండలో..


బజార్‌హత్నూర్: పంట చేనుకు వెళ్తున్న రైతు..

క్లుప్తంగా

ఆత్మీయ సమ్మేళనానికి స్థలం పరిశీలించిన ఎమ్మెల్యే


స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బాపురావు

తలమడుగు: ఈ నెల 25న బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి మండలంలోని కజ్జర్ల గ్రామంలో స్థలాన్ని బుధవారం బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ అధికార ప్రతినిధి మెట్టె కిరణ్ కుమార్, ఉప సర్పంచ్ ప్రశాంత్, గ్రామ పెద్దలు దేవరెడ్డి, వెంకట్‌రెడ్డి, సుభాష్, మల్లేష్ యాదవ్ పాల్గొన్నారు.

నేడు సర్పంచులకు సన్మానం

నేరడిగొండ: నేషనల్ పంచాయతీ అవార్డులో భాగంగా మండలంలోని 16 గ్రామ పంచాయతీల సర్పంచులకు కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో అబ్దుల్ సమద్ తెలిపారు. గురువారం మధ్యాహ్నం 12 గంటలకు మండల కార్యాలయ సమావేశ మందిరంలో జెడ్పీటీసీ అనిల్ జాదవ్, ఎంపీపీ రాథోడ్ సజన్‌ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు.

నేడు మైనార్టీ రుణాలకు ఎంపిక

ఇచ్చోడ: మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం ఉదయం 11 గంటలకు మైనార్టీ రుణాలకు లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు ఎంపీడీవో రాంప్రసాద్ తెలిపారు. మైనార్టీ కార్పొరేషన్ ద్వారా తెలంగాణ ప్రభుత్వం మండలానికి కేటాయించిన టార్గెట్‌లో భాగంగా లక్కిడిప్ ద్వారా ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు ఎంపిక ప్రక్రియకు హాజరు కావాలని కోరారు.

రామాలయ నిర్మాణానికి రూ.51వేల విరాళం

తాంసి: మండలంలోని కప్పర్ల గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయం నిర్మాణానికి గ్రామానికి చెందిన మెడికల్ యజమాని నగేష్ రూ.51వేల విరాళం అందజేసి ఉదారతను చాటుకున్నాడు. బుధవారం గ్రామంలో ఆలయ కమిటీ సభ్యులకు నగదును అందజేశాడు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సదానంద్, గ్రామస్తులు నారాయణ, సంతోష్, మహేందర్ ఉన్నారు.

అంతర్గాంలో ఆర్టీసీ బస్సుకు పూజలు

తాంసి: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. రైతులు తమ పంటచేలలో సైతం పూజలు నిర్వహించి ఖరీఫ్ పనులకు శ్రీకారం చుట్టారు. భీంపూర్ మండలంలోని అంతర్గాం గ్రామస్తులు ఆర్టీసీ బస్సుకు పూజలు నిర్వహించారు. నిత్యం తమకు వివిధ పనుల నిమిత్తం జిల్లా కేంద్రానికి తీసుకువెళ్లే బస్సుకు ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మామిడి ఆకుల తోరణాలు కట్టి పూజలు నిర్వహించారు. అనంతరం బస్సు డ్రైవర్, కండక్టర్లను సన్మానించారు. కార్యక్రమంలో గ్రామస్తులు స్వామి, రాజు, దత్తు ఉన్నారు.

కుట్టుమిషన్ల పంపణీ


కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ

తలమడుగు: మండలంలోని రుయ్యాడి గ్రామంలో బుధవారం డ్రీమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఐదుగురికి కుట్టుమిషన్లను జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి, డ్రీమ్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ సమతారెడ్డి, పీడీ కృష్ణారెడ్డి పంపిణీ చేశారు. డ్రీమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రైతులకు, మహిళలకు అనేక సేవ కార్యక్రమాలు చేపట్టడడం జరుగుతుందన్నారు. అలాగే అర్లి గ్రామంలో రైతులకు సేంద్రియ ఎరువులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పోతరెడ్డి, జంగుబాబు, అశోక్, వెంకన్నయాదవ్, గంగారెడ్డి, వెంకటేశ్ ఉన్నారు.

శోభాయాత్రకు తరలిరావాలి


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సభ్యులు

ఆదిలాబాద్: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీరామనవమి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఈనెల 30వ తేదీన భారీ శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు సమితి ప్రతినిధి రాళ్ల బండి మహేందర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మఠాధిపతి యోగానంద సరస్వతి స్వామిజీతో కలిసి పోస్టర్లను ఆవిష్కరించారు. సాయంత్రం నాలుగు గంటలకు గోపాలకృష్ణ మఠం నుంచి శోభాయాత్ర ప్రారంభమవుతుందన్నారు.

పండుగలు శాంతియుతంగా నిర్వహించుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: శాంతియుత మార్గంలో పండుగలను జరుపుకోవాలని డీఎస్పీ ఉమేందర్ అన్నారు. పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన పీస్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎలాంటి అల్లర్లు, గొడవలకు తావివ్వకుండా పండగలు జరుపుకోవాలన్నారు. పుకార్లు నమ్మవద్దని, అలాంటివి ఏమైనా ఉంటే ముందుగా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఇందులో సీఐ సత్యనారాయణ, ఎస్సైలు కలీం, హరిబాబు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

'బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం'


పార్టీ కండువా కప్పుతున్న శ్రీనివాస్ రెడ్డి

ఆదిలాబాద్: రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి సాధ్యమని బీజేపీ నాయకుడు కంది శ్రీనివాస్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో పట్టణంలోని శాంతినగర్ కాలనీకి చెందిన పలువురు యువకులు బుధవారం పార్టీలోకి చేరగా వారికి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14ఏళ్ళుగా నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే జోగు రామన్న చేసిందేమీ లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్ సింగ్ ఠాకూర్, రాజ్ కుమార్, చిత్రు, రిషి, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన


పంట పరిశీలిస్తున్న నాయకులు

బోథ్: మండలంలో ఇటీవల కురిసిన వడగండ్ల వానకు దెబ్బతిన్న పంటలను బీజేపీ నాయకులు బుధవారం పరిశీలించారు. సొనాల గ్రామంలో ఇర్ల అభిలాష్, తుల శ్రీకాంత్, కచ్చ కాయల హరీష్‌లకు చెందిన మొక్కజొన్న పంటలు పరిశీలించారు. రైతులకు ఎకరానికి రూ.50వేల నష్టపరిహారాన్ని అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పంటలకు బీమాను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆడె మానాజీ, బోథ్ అసెంబ్లీ కన్వీనర్ సూర్యకాంత్ గిత్తే, మండల కన్వీనర్ సుభాష్ సూర్య, జిల్లా కార్యదర్శి మాధవ్ ఆమ్టే, జిల్లా ఉపాధ్యక్షులు బాబురావ్ ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న


చిత్ర ప్రదర్శన తిలకిస్తున్న ఎమ్మెల్యే రామన్న

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ ఏర్పడిన తొమ్మిదేళ్ల కాలంలో ప్రజలు క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు పరిష్కారం చూపామని, మిగిలిన సమస్యలను సైతం పరిష్కరించే దిశగా అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. పట్టణంలోని దస్నాపూర్‌లోని శ్రీరామాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేయనున్న షెడ్ నిర్మాణానికి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. స్థానికులతో పలు అంశాలపై చర్చించారు. అంతకుముందు కాలనీకి వచ్చిన ఎమ్మెల్యేకు స్థానికులు స్వాగతం పలికి సన్మానించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, పట్టణ అధ్యక్షులు అలాల్ అజయ్, కౌన్సిలర్ భరత్, పార్వతి. ఐలయ్య, రాజు అనిల్ పాల్గొన్నారు.

మౌలిక వసతులకు కృషి..

ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతులను కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలను బుధవారం ఆయన సందర్శించారు. అక్కడ జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ అనిత కళాశాలలోని సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి పాల్గొన్నారు.

సంస్కృతి పరిరక్షణ అభినందనీయం

ఆదిలాబాద్: కళలు, సంస్కృతిని పరిరక్షించాలనే లక్ష్యంతో మంథనం ఒక సంకల్పం అనే పేరిట కళా సాంస్కృతిక వేదికను ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీరామచంద్ర గోపాలకృష్ణామఠంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని పలువురు రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులు, కళాకారులు ఏర్పాటు చేసిన కళా సాంస్కృతిక వేదిక ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠాధిపతి యోగానంద సరస్వతీ స్వామి, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శంకర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినిరెడ్డి, వేదిక ప్రతినిధులు నిషికాంత్ దేశ్పాండే, సతీష్ దేశ్పాండే, హరి శ్రీపాదరావు పాల్గొన్నారు.

'ప్రశ్నించే గొంతు నొక్కడం సరికాదు'

నేరడిగొండ: బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రశ్నించే గొంతును నొక్కడం సిగ్గుచేటని బీజేపీ మండల అధ్యక్షుడు సోనయ్య హీరాసింగ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు, బీఆర్ఎస్ గుండాలు కుమ్మక్కై క్యూ న్యూస్‌పై దాడి చేసి భయంకరమైన వాతావరణాన్ని సృష్టించడంతో పాటు తీన్మార్ మల్లన్న, తెలంగాణ విఠల్, సుదర్శన్ గౌడ్ లను కిడ్నాప్ చేయడం దారుణమన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న వాస్తవాలను, లిక్కర్ స్కామ్‌లో నిందితులైన కల్వకుంట్ల కవిత విచారణతో పాటు టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ వ్యవహారంపై రాష్ట్ర ప్రజలకు వాస్తవాలను చెబుతున్నారని అన్నారు. మీడియాపై కూడా బీఆర్ఎస్ గుండాలు, పోలీసులు దాడులకు పాల్పడం శోచనీయమన్నారు. బీఆర్ఎస్ పార్టీకి చరమగీతం పాడే రోజులు దగ్గరలోనే ఉన్నాయని ఎద్దేవా చేశారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సోలంకి ప్రశాంత్, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి చొక్కపెల్లి రాములు, పట్టణ అధ్యక్షుడు రాథోడ్ రాజశేఖర్, ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు అనుపట్ల సంజీవ్, యువ మోర్చా మండల అధ్యక్షుడు బాక్రె లక్ష్మణ్, జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు గట్టు నారాయణ, కిసాన్ మోర్చా మండల ప్రధాన కార్యదర్శి భీంరావ్ ఉన్నారు.

నేటి ఓటమే రేపటి విజయానికి నాంది


క్రీడాకారులకు చెక్కు ఇస్తున్న జెడ్పీటీసీ గణేశ్‌రెడ్డి

తలమడుగు: క్రీడల్లో నేటి ఓటమే రేపటి విజయానికి నాంది అని జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని కప్పర్‌దేవి గ్రామంలో వారం రోజుల పాటు నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ బుధవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి జెడ్పీటీసీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో ఆదిలాబాద్, తాంసి, భీంపూర్ మండలాలతో పాటు మహారాష్ట్రలోని మాడ్వి, కిన్వాట్ గ్రామాల క్రీడాకారులు పాల్గొనడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగాప్రతిభ కనబర్చిన ఉండమ్ గ్రామానికి మొదటి బహుమతి రూ.30వేల చెక్కును ప్రభుత్వ ఉపాధ్యాయుడు త్రియంబక్ అందించారు. రెండవ బహుమతి కోసాయి గ్రామానికి చెందిన జట్టుకు రూ.25వేల చెక్కును జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి, మూడోవ బహుమతిని భరంపూర్ గ్రామానికి రూ.20వేలు ఎంపీటీసీ హన్మంత్ అందించారు. నాల్గో బహుమతి సకినాపూర్ రూ.15వేలు అందిచారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దివ్య మాదవ్, గ్రామ సర్పంచ్ రఘు, వెంకన్న యాదవ్, త్రీయంబక్ శ్రీనివాస్ పటేల్, దేవ్‌రావు ఉన్నారు.

వాటర్ ఫౌంటెన్ పనుల ట్రయల్‌రన్


ట్రయల్‌రన్ పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ ప్రేమేందర్

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణ సుందరీకరణలో భాగంగా తెలంగాణ చౌక్‌లో వాటర్ ఫౌంటెన్‌ను ఏర్పాటు చేశారు. బుధవారం రాత్రి ఈ ఫౌంటేన్ ట్రయల్ రన్ చేపట్టారు. మున్సిపల్ ట్యాంకర్ల ద్వారా నీటిని నింపి దాన్నీ ప్రారంభించారు. ట్రయల్‌రన్ పనులను మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ డీఈ తిరుపతితో కలిసి పరిశీలించారు. రానున్న కాలంలో పట్టణం మరింతగా అభివృద్ధి చెందుతుందని, త్వరలో దీనిని ప్రారంభిస్తామని తెలిపారు.

జోరుగా శనగ కొనుగోళ్లు

- నేటి నుంచి పునఃప్రారంభం
- ఇప్పటికే 22,500 క్వింటాళ్ల కొనుగోలు



జైనథ్: మండలంలో ఈ ఏడాది శనగ కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయి. ఈ నెల 8 నుంచి ప్రారంభమైన శనగ కొనుగోళ్లలో కేవలం వారం రోజుల వ్యవధిలోనే 22,500 క్వింటాళ్ల శనగలు కొనుగోలు చేశారు. ఈ నెల 8 నుంచి 16 వరకు కొనుగోళ్లు నిరాటంకంగా సాగినప్పటికీ వాతావరణంలో మార్పులతో కొనుగోళ్లకు బ్రేక్ పడింది. అయితే ఈ నెల 23 నుంచి మరల కొనుగోళ్లను పునః ప్రారంభిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

భారీగా శనగ సాగు..

ఈ ఏడాది యాసంగిలో గతంలో ఎన్నడూ లేనివిధంగా ఏకంగా 23వేల ఎకరాల్లో శనగ సాగులోకి వచ్చింది. మండలంలో సాత్నాల ప్రాజెక్ట్, లక్ష్మీపూర్ రిజర్వాయర్ నీళ్లు రైతులకు అందుబాటులో ఉండటం, చేన్లలో బోర్ల శాతం కూడా పెరగడంతో యాసంగి సాగు యేటా పెరుగుతూ వస్తోంది. 2014లో కేవలం 5వేల ఎకరాలుగా ఉన్న యాసంగి సాగు క్రమంగా పెరుగుతూ ప్రస్తుతం 25వేల ఎకరాలకు చేరింది. ఇందులో 23వేల ఎకరాలు శనగ కాగా, మిగిలిన 2వేల ఎకరాల్లో జొన్న, ఇతర పంటలు సాగుచేస్తున్నారు. ఈ ఏడాది భారీగా పెరిగిన శనగ సాగు విస్తీర్ణంతో దాదాపు లక్ష క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉన్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

వారంలో 22,500 క్వింటాళ్ల కొనుగోలు

ఈ నెల 3న ఎమ్మెల్యే జోగు రామన్న మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్‌లో శనగ కొనుగోళ్లు ప్రారంభించారు. కాగా 8 నుంచి పూర్తి స్థాయిలో కొనుగోళ్లు ప్రారంభం కాగా 16 వరకు నిరాటంకంగా కొనసాగింది. వారం రోజుల్లో దీపాయిగూడ, లక్ష్మీపూర్, కూర, కుతుంపూర్ గ్రామాల రైతుల వద్ద నుంచి ఏకంగా 22,500 క్వింటాళ్లు కొనుగోళ్లు చేశారు. ఇంకా మండలంలో 60–70వేల క్వింటాళ్ల శనగలు రైతుల వద్ద ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

లక్కీ డ్రా విధానంలో గ్రామాల ఎంపిక..

గతంలో శనగ కొనుగోళ్ల విషయంలో తీవ్ర ఇబ్బందులు ఉండేవి. కేంద్ర ప్రభుత్వం ఎంఎస్‌పీకి కేవలం 25శాతం మాత్రమే కొనుగోలు చేస్తుండడంతో చివరన ఉన్న గ్రామాలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యేవి. మరల రాష్ట్ర ప్రభుత్వం మిగిలిన పంట కొనుగోలుకు అనుమతులు ఇచ్చిన తరువాత మిగిలిన గ్రామాల రైతుల వద్ద నుంచి శనగల కొనుగోళ్లు జరిగేవి. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ వాటా పూర్తి కావడంతో మరల కొనుగోళ్లు పునః ప్రారంభం అవుతాయా? కావా? అనే సందేహం ఉండేది. కానీ ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం నుంచి కొనుగోళ్లకు ఆదేశాలు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు.

నేటి నుంచి పునః ప్రారంభం

శనగల కొనుగోళ్లకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. ఈ నెల 23 నుంచి శనగలు కొనుగోళ్లు మరల ప్రారంభమవుతాయి. రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. చివరి గింజ వరకు కొనుగోళ్లు చేస్తాం.

- గౌరీ నాగేశ్వర్, డీఎం మార్క్‌ఫెడ్

అభివృద్ధి పనులకు భూమిపూజ

బజార్‌హత్నూర్: మండలంలోని గోకొండ గ్రామపంచాయతీ పరిధిలోని దాబాడి గ్రామంలో రూ.6లక్షల సీడీఎఫ్ నిధులతో నిర్మించనున్న కల్వర్టు నిర్మాణానికి బుధవారం టీఆర్ఎస్ మండల కన్వీనర్ కానిందే రాజారాం భూమిపూజ చేశారు. చందేపూర్ అంకుష్, ఉప సర్పంచ్ నానక్‌సింగ్, దేవుసింగ్, కార్తర్‌సింగ్, ప్రేంసింగ్, భారత్, ఆనంద్‌రావ్, కాశీనాథ్, డల్లునాయక్, రంగ్‌లాల్ పాల్గొన్నారు.